ప్రజాశక్తి
శుక్రవారం 25 నవంబర్ 2022



డ్రిప్పు, స్ప్రింక్లర్లపై జిఎస్‌టి రద్దుచేయాలి

అనంతపురం కలెక్టరేట్ : కరువు జిల్లా అనంతలో ఇచ్చే డ్రిప్, స్ప్రింకర్లపై జీఎస్టీ రద్దు చేసి పిఎం కిసాన్ పథకం కింద రైతులకు ఉచితంగా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డ్రిప్ స్ప్రిక్లర్ పరికరాలపై కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి విధిస్తూ రైతులపై భారం మోపడం సరికాదన్నారు. నీటిని ఆదా చేసే లక్ష్యంతో నీటి కొరత ఉన్న మెట్ట ప్రాంతాల్లో బిందు సేద్యాన్ని ప్రోత్సహించడానికి సబ్సిడీలు ఇస్తున్నామని ప్రభుత్వం ఒకవైపు ప్రచారం చేసుకుంటూ మరోవైపు స్ప్రింక్లర్ల పరికరాలపై కేంద్ర ప్రభుత్వం 12 శాతం జీఎస్‌టి భారం మోపడం సరికాదన్నారు. ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రైతులపై జీఎస్‌టి భారం మోపడం సరికాదన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించాలన్నారు. జీఎస్‌టి రద్దు చేయని పక్షంలో ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు శ్రీనివాసులు, వన్నూరప్ప పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధ్యక్షుల నియామకం

◆ 'అనంత'కు పైలా నరసింహయ్య

◆ 'సత్యసాయి'కి శంకర నారాయణ

◆ రీజినల్ కో ఆర్డినేటర్‌గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి









ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వైసిపి జిల్లా అధ్యక్షులను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ మేరకు గురువారం నాడు అధికారిక ప్రకటన వెలువడింది. అనంతపురం జిల్లా అధ్యక్షులుగా పైలా నరసింహ్యాను నియమించగా, సత్యసాయి జిల్లాకు సంబంధించి మాజీ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణను నియమించారు. ఈ ప్రాంత కో ఆర్డినేటర్‌గా మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డిని నియమించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇప్పటికే అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగానూ ఉన్నారు. ఇక పార్టీ బాధ్యతలను ఆయన చూడనున్నారు.

ఎన్నికలకు శ్రేణులను సమయత్తం చేయగలరా..?

అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలు ఎన్నికల ప్రణాళికల్లో ఉన్నాయి. 2024లో సాధారణంగా ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. ఒకవేళ ముందస్తుగా వెళ్తే ఇంకా ముందుగానే ఎన్నికలు వస్తాయి. ఈ ఎన్నికలను వైసిపి కొత్త అధ్యక్షులు ఏ మేరకు సమన్వయం చేయగలరన్నది చూడాల్సి ఉంది. ఇది వరకు అనంతపురం జిల్లాకు వైసిపి అధ్యక్షులుగా రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఉండేవారు. వ్యక్తిగత, కుటుంబ కారణాలతో అధ్యక్షుడిగా కొనసాగలేనంటూ ఆయన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి చెప్పి రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో అధిష్టానం కొత్త అధ్యక్షున్ని నియమించింది. అందులో భాగంగా అనంతపురం జిల్లా అధ్యక్షులుగా పైలా నరసింహయ్యను నియమించారు. జిల్లాలో పైలా నరసింహయ్య ఏ మేరకు నేతలందరినీ సమన్వయం చేయగలరన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇప్పటికే ఆయన సొంత ప్రాంతమైన తాడిపత్రి నియోజకవర్గంలోనే అక్కడి ఎమ్మెల్యే పెద్దారెడ్డితో సరైన సఖ్యత లేదని పార్టీ వర్గాల్లో చర్చసాగుతోంది. పైలా ప్రారంభంలో వైసిపిలో చేరినప్పటికీ మధ్యలో ఆయన పార్టీని వీడి తిరిగి మళ్లీ వైసిపిలో చేరారు. ఇప్పుడు ఆయనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలను పార్టీ భుజానపెట్టింది. జిల్లాలో కొద్ది మంది నేతల మధ్య సరైన సమన్వయం లేదు. ఒక్కోసారి బాహాటంగానే ఇవి కనపించాయి. ఇటువంటి సమయంలో సీనియర్ నాయకులను కలుపుకుని పార్టీని నడిపించడం పెద్ద సవాల్‌గానే మారనుంది. ఇక సత్యసాయి జిల్లాకు మాజీ మంత్రి శంకర నారాయణకు తిరిగి బాధ్యతలు అప్పగించారు. మంత్రి పదవుల మార్పు సమయంలోనే పదవులు కోల్పోయే వారికి పార్టీ బాధ్యతలిస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు శంకర నారాయణకు సత్యసాయి జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలను అప్పగించారు. శంకర నారాయణ గతంలోనూ ఉమ్మడి అనంతపురం జిల్లా కన్వీనర్‌గా పనిచేశారు. పార్టీకి విధేయుడిగా, ముఖ్యమంత్రి నమ్మకాన్ని చూరగొనడంతో ఆయన తొలి విడతలోనే మంత్రి పదవి వరించింది. ఆయనకు అధిష్టానం వద్ద మంచి పలుకుబడే ఉందని చెప్పొచ్చు. అయితే నేతల మధ్య సమన్వయం చేసే విషయంలో ఏ మేరకు సఫలీకృతమవుతారన్నది ప్రశ్నార్థకమనే చెప్పాలి. ఇప్పటికే హిందూపురంలో పెద్దఎత్తున విభేదాలు కొనసాగుతున్నాయి. నేతలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇక్బాల్ మధ్య ప్రత్యక్ష పోరు సాగుతోంది. శంకర నారాయణకు సొంత నియోజకవర్గం పెనుకొండలోనే కొంత మంది నుంచి అసంతృప్తి ఉంది. ఇతరచోట్ల కూడా ఇదే పరిస్థితులున్నాయి. వీటిని సరిచేసే పార్టీని ఏకతాటిపై నడిపించడం కత్తిమీద సామే అవనుంది.

పెద్దిరెడ్డే కీలకం..

ఉమ్మడి జిల్లాలో వైసిపి అధ్యక్షులిద్దరూ నాయకులు అందరినీ సమన్వయం చేసే పరిస్థితి ఉందా.? లేదా.? అన్న ప్రశ్నలకు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రూపంలో సమాధానం విన్పిస్తోంది. వైసిపిలో సీనియర్ నాయకుడు, మంత్రి అయిన పెద్దిరెడ్డి జిల్లాలోని అందరి నేతలతో పరిచయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నాయకులను సమన్వయం చేసేందుకు రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపైనే అందరూ ఆధారపడాల్సి ఉంటుందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఆయన సీనియర్ నాయకుడే కాకుండా పార్టీ అధిష్టానంలో కీలకమైన వ్యక్తుల్లో ఒకరు కావడం చాలా వరకు సమస్యలను పరిష్కరిస్తారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

ప్రశ్నించే గొంతులను శాసన మండలికి పంపుదాం



పరిచయ కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్రంలో త్వరలో జరుగనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించి శాసన మండలికి సమాజ శ్రేయస్సుపై ప్రశ్నించే గొంతుకలను పంపిద్దామని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో యుటిఎఫ్, ఎస్‌టియు, సిఐటియు, ఎఐటియుసి, అభ్యుదయ, ప్రజాతంత్ర, ఉపాధ్యాయ, సామాజిక, తరగతులు బలపరుస్తున్న పిడిఎఫ్ అభ్యర్థుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి రాయలసీమ పట్టుభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా రాయలసీమ ప్రాంతం అభివృద్ధికి అనేకమైన హామీలు ఇచ్చిందన్నారు. ఉద్యోగుల, ఉపాధ్యాయులకు పీఆర్సీ వారం రోజుల్లో అమలు చేస్తానని, సీపీఎస్ రద్దుచేస్తానని సీఎం జగన్‌రెడ్డి హామీ ఇచ్చాడన్నారు. ఐతే ఆ హామీని అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు అడిగితే అణచివేతలకు తెగబడ్డారని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం రాజ్యాంగ విలువలను మంట కలుపుతూ అప్రజాస్వామిక పాలన సాగిస్తోందని విమర్శించారు. ఉద్యోగ, కార్మిక, నిరుద్యోగ, ప్రజా సమస్యలపైన శాసన మండలిలో మాట్లాడే ప్రతినిధులు లేరన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గత ఎన్నికల్లో కత్తి నరసింహారెడ్డి గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పైన, సీపీఎస్ పైన రాజీలేని పోరాటాలు చేస్తూ వారి గళం వినిపించారన్నారు. డాక్టర్ పోతుల నాగరాజు తన ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తినే వదిలేసుకుని మన ప్రాంతంలో అనేక సమస్యల నడుమ నలిగిపోతున్న నిరుద్యోగ, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి సమస్యల పైన నిరంతరం రాజీలేని పోరాటలు చేస్తున్న వ్యక్తిని శాసన మండలికి పంపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగ విలువలను భ్రష్టుపట్టిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు పిడిఎస్ బలపరుస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన గురుతర బాధ్యత ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఓ.నల్లప్ప, మాజీ ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులు నారాయణస్వామి, ఎస్‌టియు నాయకులు హరిప్రసాద్, యుటిఎఫ్ జిల్లా నాయకులు రాఘవేంద్ర, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి, జెవివి హరిప్రసాద్ యాదవ్, వృత్తిదారుల సంఘం జిల్లా నాయకులు బి.శ్రీనివాసులు, ప్రయివేట్ టీచర్స్ యూనియన్ నాయకులు గోపీ, సురేష్, సిఐటియు, ఎఐటియుసి, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిఎం జగన్‌కు తెలిసే అక్రమ డీజిల్ వ్యాపారం

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు



మీడియాతో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో జరుగుతున్న అక్రమ డీజిల్ వ్యాపారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి తెలిసే జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని టిడిపి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు అన్నారు. గురువారం టిడిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖనిజ సంపదను దోచుకోవడంలో ఆరితేరిన వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు అక్రమ డీజిల్ వ్యాపారంపై పడ్డారని విమర్శించారు. పక్క రాష్ట్రాల నుంచి తక్కువ ధరలకు తీసుకొచ్చిన డీజిల్‌ను ఆర్‌టిసి డిపోలు, పెద్ద కాంట్రాక్టర్లు, వినియోగ సంస్థలకు విక్రయిస్తూ కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. రాయదుర్గం నియోజకవర్గంలో అక్రమ డీజిల్ రవాణాను పట్టుకుంటే ఆర్‌టిసి డిపో వారు తమ సంస్థకు సరఫరా చేసే డీజిల్ పట్టుకోవడానికి వీలు లేదంటూ చెబుతున్నారని తెలిపారు. వీటి వెనుక అసలు సూత్రదారులు ఎవరో ఇప్పటికే ఆయా ప్రాంతాల ప్రజలకు తెలుసన్నారు. అయితే ప్రభుత్వానికి పన్నుల రూపంలో చెల్లించాల్సిన సొమ్మును చెల్లించనందుకే ప్రశ్నించాల్సి వచ్చిందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5 లక్షల లీటర్ల డీజిల్ వ్యాపారం చేస్తున్నారని, సగటున నెలకు రూ.కోటి ప్రభుత్వానికి పన్నుల రూపంలో రావాలని, ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోందన్నారు. సేల్స్ ట్యాక్స్ అధికారులు నిద్రవస్థలో ఉన్నట్లు నటిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. అక్రమ డీజిల్ వ్యాపారంలో ఎవరి వాటా ఎంతో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వానికి రావాల్సిన పన్ను వసూలు చేయాలని కోరారు.

సరి చేయమంటే.. సస్పెండ్ చేశారు..!

◆ లోపాన్ని చెప్పిన ఉపాధ్యాయుడుపై సస్పెన్షన్ వేటు

◆ ఉన్నతాధికారుల నిర్ణయం అన్న డిఇఒ

◆ అధికారులపై ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం



ముఖహాజరు నమోదుకు తలపై వెంట్రుకుల, మీసాలతో ఉన్న ఉపాధ్యాయుడు ఆదినారాయణ



గుండు అనంతరం ఆన్‌లైన్‌లో ముఖ హాజరు కోసం ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయుడు ఆదినారాయణ

ప్రజాశక్తి-హిందూపురం

'పాఠాలు సరిగా బోధించని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటారు... పాఠశాలకు రాకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవడం మనం చూసి ఉంటాం. ఇలాంటి వాటికి విరుద్ధంగా సత్యసాయి జిల్లా విద్యాశాఖ అధికారులు వ్యవహరించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించి 'ఫేస్‌యాప్ ఆన్‌లైన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించమన్నందుకు ఏకంగా ఆ ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేసి ప్రభుత్వంపై వారికున్న స్వామిభక్తిని చాటుకున్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించమని కోరడమే ఆయన చేసిన నేరం అయినట్లు అతనిపై కక్షగట్టి చర్యలు తీసుకున్నారు. ఈ సస్పెన్షన్ నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని మేళాపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎల్ఎన్.ఆదినారాయణ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆయన మొక్కు తీర్చుకోవడం కోసం తిరుపతికి వెళ్లాడు. ఈ సమయంలో తలనీలాలు సమర్పించాడు. తిరిగి పాఠశాలకు గుండుతో వచ్చారు. గుండుతో వచ్చిన ఆయన హాజరును పాఠశాల ఫేషియల్ యాప్(ముఖహాజరు)లో నమోదు కాలేదు. ముఖహాజరు ప్రారంభ నమోదు సమయంలో ఆయన తలకు వెంట్రుకలు, మూతిపై మీసాలు ఉన్నాయి. తిరుపతి వెళ్లొచ్చిన తరువాత జుట్టు, మీసం లేని కారణంగా ముఖహాజరు నమోదు కాలేదు. ఈ విషయాన్ని సదురు ఉపాధ్యాయుడు ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లారు. ఉపాధ్యాయుని ప్రమేయం లేకుండానే ఈ విషయం పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అయ్యింది. దీనిపై విద్యాశాఖ అధికారులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు చేసిన ఈ పని నేరం అన్నట్లుగా భావించారు. ఇందుకు సంబంధించి ఈ నెల 17వ తేదీన ఉపాధ్యాయుడికి జిల్లా విద్యాశాఖ అధికారులు మెమో జారీ చేసి, వివరణ కోరారు. ఇందుకు సంబంధించి ఉపాధ్యాయుడు ఎంఇఒ ద్వారా వివరణ పంపాడు. కాగ ఈ వివరణ సరిగా లేదంటూ జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి గురువారం నాడు ఉపాధ్యాయుడు ఆదినారాయణను ఏకంగా సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. యాప్‌లోని లోపాలను సరిచేయమన్నందుకు సస్పెండ్ చేయడం ఏమిటంటూ ఉపాధ్యాయ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తక్షణం ఆయన సస్పెన్షన్‌ను ఎత్తేయాలని, లేకుంటే ఆందోళనలు చేపడతామని తెలియజేశారు.

ఉన్నతాధికారుల నిర్ణయం మేరకే... డిఇఒ మీనాక్షి

హిందూపురం పురపాలక సంఘం మేళాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆదినారాయణను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే సస్పెండ్ చేశామంటూ డిఇఒ పాత్రికేయుల ఎదుట పేర్కొన్నారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మేళాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఆదినారాయణ అనే ఉపాధ్యా యున్ని ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకే సస్పెండ్ చేశామ న్నారు. ఫేస్ యాప్ రిజిస్టర్‌లో సాంకేతికలోపాలు కొన్ని ఉన్న మాట వాస్తవమే అన్నారు. అయితే ఈ అంశాన్ని ఉపాధ్యాయుడు బహిర్గతం చేయడం, ఆ అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీ యాంశంగా మారిందన్నారు. ఉపాధ్యా యుడు ముఖహాజరు పడని రోజు ఎటువంటి సాంకేతిక లోపం లేదన్నారు. ఫోన్‌లో నెట్‌వర్క్ సమస్య రావాడం వల్ల ఇలా జరిగి ఉండొచన్నారు. ఈ విషయాన్ని బహిర్గతం చేయడం సరైన పద్ధతి కాదని భావించిన ఉన్నతాధికారులు ఆయన్ను సస్పెండ్ చేయాలని ఆదేశించారన్నారు.

కార్మికులపై పని భారం మోపొద్దు

◆ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిాస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిాస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరావు

ప్రజాశక్తి-తాడిపత్రి

వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులపై పనిభారం మోపకుండా నిబంధనల మేరకే పనులు చేయించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిాస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నాడు తాడిపత్రిలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు అలవెన్స్‌లు పోరాటాల ద్వారానే సాధించుకున్నామని చెప్పారు. దీనిని ప్రభుత్వాలు ఆదేశించినా స్థానికంగా అధికారులు అమలు చేయకపోవడం దారుణం అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచాల్సి ఉందన్నారు. ఎన్నికల ముందు కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తుంగలో తొక్కారని అన్నారు. మున్సిపల్ కార్మికులతో పాటు ఇతర శాఖల ఒప్పంద కార్మికులను బానిస వ్యవస్థలోకి తోసే విధంగా ప్రభుత్వ విధనాలు ఉన్నాయన్నారు. పని చేసే సమయంలో కనీస వేతనాలు లేక, ఉద్యోగ విరమణ తరువాత ఎలాంటి ఉద్యోగ విరమణ సదుపాయాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. కార్మికులకు సరెండర్లు సెలవులు లేవన్నారు. ఉద్యోగోన్నతలు లేవన్నారు. విధులకు అవసరం అయ్యే చెప్పులు, సబ్బులు, యూనిఫాంతో పాటు ఇంజినీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులను ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగన్ ఇచ్చిన హామీల అమలు కోసం కార్మికులంతా ఐక్య పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగా డిసెంబర్ 20, 21, 22వ తేదీల్లో మున్సిపల్ కార్మికుల రాష్ట్ర మహాసభలు అనంతపురంలో జరగనున్నాయని చెప్పారు. ఇందులో కార్మికుల సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చించనున్నట్లు చెప్పారు. కార్మికులందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణం, సహాయ కార్యదర్శి అంజి, సిఐటియు నాయకుడు ఉమాగౌడ్, వన్నూరప్ప, నరసింహమూర్తి, ఫక్రుద్దీన్, రాముడు పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తిదాయకం 'ఉయ్యాల' స్వాతంత్ర్య పోరాటం

ప్రజాశక్తి-ఆత్మకూరు

రేనాటి సూర్యుడు, ప్రథమ స్వాతంత్ర్య పోరాట యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి భావితరాల దేశభక్తి యోధులకు స్ఫూర్తిదాయకుడని వక్తలు కొనియాడారు. అనంతపురం లలితకళా పరిషత్‌లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతి వేడుకలను ఎపి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి విశ్రాంత విసి, సర్వీస్ కమిషన్ విశ్రాంత ఛైర్మన్, ప్రస్తుత కిమ్స్ సవీరా ఆస్పత్రి సీఈవో వెంకటరామిరెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించి ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటి మేయర్ దాసరి సాహిత్య మాట్లాడుతూ.. మనం మనవారసులకు గత చరిత్ర తెలియజేయాలని అందునా ఉయ్యాలవాడ నరసింహారెడ్డిలాంటి దేశభక్తుడి చరిత్ర తెలుపడం వల్ల దేశభక్తి భావన పెంపొందించవచ్చునన్నారు. ఈ పోరాట యోధుడి విగ్రహం నగరంలో ఏర్పాటు చేయడానికి నగరపాలక సంస్థను సంప్రదించారన్నారు. తప్పకుండా నగరంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటుకు తోడ్పాటు నందిస్తామన్నారు. లలితకళా పరిషత్ అధ్యక్షులు వెంకట సుబ్బయ్య, వాణికళాశాల ప్రిన్సిపల్ దామోదరరెడ్డిలు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్ర, ఆంగ్లేయులపై ఆయన పోరాట గాధలను వివరించారు. జిల్లా అధ్యక్షులు రేనాటి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లే రోజులనుంచి ఆంగ్లేయుల దాష్టీకాన్ని గమనిస్తూ వచ్చి సొంతంగా సైన్యాన్ని తయారుచేసుకుని ప్రజలలో స్వాతంత్ర్య కాంక్ష రగిలించాడని, సొంత మనుషులే ఆంగ్లేయులకు అతని ఆనవాళ్లు తెలియజేసి ఉరికంబం ఎక్కేలాచేశారన్నారు. ఆయన ఒకవర్గానికి సంబంధించినవాడు కాదని రాయలసీమవాసులు గర్వించదగ్గ దేశభక్తుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవాధ్యక్షులు గట్టిరెడ్డి బయపరెడ్డి, హైకోర్టు లీగల్ సెల్ కన్వీనర్ వై.భాగ్యలక్ష్మిరెడ్డి, జిల్లా రచయితల సంఘం కార్యదర్శి టివి రెడ్డి, పాటిల్ రామకృష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎపి రెడ్డి సంఘం ప్రతినిధులు వక్తలను, మార్గదర్శకులను శాలువాలతో సత్కరించారు.

గ్రామాభివృద్ధికి పెద్దపీట : విప్ కాపు



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న విప్ కాపు

ప్రజాశక్తి-కణేకల్లు

జగనన్న పాలనలో గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని రాయదుర్గం ఎమ్మెల్యే, విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం కణేకల్లు మండలం కలేకుర్తి, రచ్చుమర్రి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విప్ కాపు రామచంద్రారెడ్డి పాల్గొని వాటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. గ్రామ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను తలుపు తట్టి అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ ఉషారాణి, జెడ్పిటిసి పద్మావతి, ఎంపిపి సంధ్య, సర్పంచి భాస్కర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ కేశవరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షులు తిమ్మప్ప, ప్రకాష్, వేమన, తహశీల్దారు రజాక్‌వలి, సీనియర్ అసిస్టెంట్ గోవింద్‌రెడ్డి, ఏవో శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

చెరువులకు నీరు విడుదల

పుట్లూరు : మండల పరిధిలోని సుబ్బరాయుడు సాగర్ నుంచి పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి గ్రామాల చెరువులకు ప్రభుత్వ విద్య సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి గురువారం నీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాఘవరెడ్డి, మడుగుపల్లి నాగేశ్వర్‌రెడ్డి, చెర్లోపల్లి వెంకటరామిరెడ్డి, వైసీపీ నాయకులు, హెచ్‌ఎల్‌సి అధికారులు పాల్గొన్నారు.

సిసిరోడ్లు నిర్మించాలని వినతి

ఉరవకొండ : ఉరవకొండ పట్టణంలోని చౌడేశ్వరి కాలనీ నాల్గవ, చర్చి లైన్ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించి ఇరువైపుల డ్రెయినేజీలను ఏర్పాటు చేయాలని ఆ కాలనీకి చెందిన మహిళలు ఎంపీడీవో అమృతరాజుకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీసీ రోడ్డు, డ్రెయినేజీలు లేకపోవడం వల్ల వర్షపు నీరు, మురుగునీరు ఇళ్లలోకి వస్తోందన్నారు. దీనివల్ల కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడడమే కాకుండా రోగాలబారిన పడుతున్నారన్నారు. తక్షణమే సిసిరోడ్డు, డ్రెయినేజీలను ఏర్పాటు చేయాలని కోరారు.

అమ్మవారిని దర్శించుకున్న 'పైలా'

శింగనమల : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య శింగనమల మండలం శివపురం గ్రామంలోని పెద్దమ్మ అమ్మవారిని గురువారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగీరథ ఫౌండేషన్ ఛైర్మన్ చీమల కొండా యాదవ్ ఆయనకు స్వాగతం పలికి శాలువతో సన్మానించారు. ఆలయ కమిటీవారు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మున్సిపల్ కౌన్సిలర్ రంగనాథ, జిల్లా బీసీ సెల్ కార్యదర్శి వినోద్ కుమార్ యాదవ్, జెల్లి గోపీ యాదవ్, విద్యా కమిటీ ఛైర్మన్ పసల నాగరాజు, రఘు యాదవ్, చిరు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ఉరవకొండ : ఉరవకొండ గ్రామ పంచాయతీ శివరామిరెడ్డి కాలనీలో నెలకొన్న నీటి సమస్యను వార్డు సభ్యులు వసికేరి మల్లికార్జున పరిష్కరించారు. విద్యుత్ మోటార్ చెడిపోయి అనేక రోజులుగా నీరు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాలనీ ప్రజలు సమస్యను వార్డు సభ్యులకు తెలపడంతో ఆయన, సర్పంచి సమస్యను పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరు చేయించి మోటారుకు మర్మతులు చేయడంతో గురువారం నీటి సమస్య పరిష్కారం అయింది. అదేవిధంగా శివరామిరెడ్డి, చిట్టా శ్రీధర్ కాలనీలో వార్డు సభ్యులు మల్లికార్జున వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. సమస్యలు పరిష్కారం కావడంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తిమ్మప్ప మృతి పార్టీకి తీరనిలోటు

కళ్యాణదుర్గం : ఒంటారెడ్డిపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కరణం తిమ్మప్ప మరణం పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి అన్నారు. తిమ్మప్ప (82) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మరణించారు. విషయం తెలుసుకున్న హనుమంతరాయ చౌదరి. మృతుని స్వగ్రామానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్జీవో నగర శాఖ అధ్యక్షులుగా మనోహర్‌రెడ్డి

అనంతపురం : ఎన్జీవో నగర శాఖ అధ్యక్షులుగా ఎం.మనోహర్‌రెడ్డి, కార్యదర్శిగా పి.శ్రీధర్‌బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు, కార్య నిర్వాహక సభ్యులనూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం జిల్లా ఎన్జీవో హోమ్‌లో అనంతపురం నగర శాఖ ఎన్జీవో ఎన్నికలు జరిగాయి. జిల్లా కార్యదర్శి డి.చంద్రమోహన్ ఎన్నికల అధికారిగా, శ్రీధర్‌స్వామి ఎన్నికల సహాయ అధికారిగా వ్యవహరించినారు.

నేడు వాహనాల వేలంపాట

బుక్కరాయసముద్రం : వివిధ కేసుల్లో పట్టుబడి బుక్కరాయసముద్రం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రెండు ద్విచక్ర వాహనాలకు శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. రూ.వెయ్యి దరావతు కట్టి వేలంపాటలో పాల్గొనాలని చెప్పారు. ఇతర వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ఉరవకొండ : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉరవకొండ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎయిడ్స్‌పై వీధి నాటక రూపంలో ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్వాహకులు మాట్లాడుతూ సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషిత రక్త మార్పిడి, హెచ్‌ఐవి సోకిన తల్లి నుంచి బిడ్డకు, కలుషితమైన సూదులు, చిరంజిల ద్వారా ఎయిడ్స్ వ్యాపించేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ మహేష్, కిరణ్ కుమార్, ఎఎన్‌ఎం వరలక్ష్మి, శివయ్య కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

పరిహారం ప్రకటించకుండా రోడ్డు విస్తరణ చేపడితే ఎలా?

పాములాయి బోగసముద్రం రోడ్డు నిర్వాసితులను ఆదుకోవాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పాములాయి నుంచి భోగసముద్రం వరకు 544-డి ఆరు లైన్ల రోడ్డు విస్తరణలో భూ నిర్వాసితులకు పరిహారం ప్రకటించిన తరువాతనే పనులు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. భోగసముద్రం రోడ్డు విస్తరణ నిర్వాసితులకు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నగరంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ఆయా గ్రామాల ప్రజలు గురువారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మాట్లాడుతూ..ఆరు లైన్ల రోడ్డు విస్తరణ చేపడుతున్న నేపథ్యంలో అనేక మంది ఇళ్లు, భూములు, షాపులు, స్థలాలు కోల్పోతున్నారని తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున ప్రజలు నష్టపోతుంటే వారికి ఇచ్చే పరిహారంపై స్పష్టత ఇవ్వకుండా రోడ్లు భవనాల శాఖ అధికారులు పనులు ప్రారంభించడం సరికాదన్నారు. 2013లోనే నాలుగు లైన్ల రోడ్డు బుక్కరాయసముద్రం నుంచి బోగసముద్రం వరకు చేపట్టారన్నారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేశారన్నారు. రోడ్డు వేయడం పూర్తి అయిన 7 సంవత్సరాల తరువాత అనేక దఫాలుగా పోరాటాలు చేసిన నేపథ్యంలో పరిహారం అందజేశారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి ప్రమాణ స్వీకారం రోజు ఐదు అంశాలపై ముఖ్యమంత్రి జగన్ సంతకాలు చేశారని తెలిపారు. హంపాపురం నుంచి అమరావతి వరకు రోడ్డు నిర్మాణంపై సంతకం చేశారన్నారు. ఆ రోజు హంపాపురం నుంచి బోగసముద్రం వరకు రోడ్డు వేస్తున్నారు కాబట్టి మా ఊరి మీద ఈ రోడ్డు పోదనే భావనతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వారి సొంత స్థలాలు, ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వం హంపాపురం నుంచి వెళ్లాల్సిన రోడ్డును పాములాయి నుంచి బోగసముద్రం రోడ్డు చేపట్టేందుకు సిద్ధపడిందన్నారు. దీంతో రోటరీపురం, కొర్రపాడు, శివపురం, బండమీదపల్లి, నార్పల క్రాసింగ్ తదితర గ్రామాల మీదుగా రోడ్డు వేస్తున్నారని, ప్రజలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. పేదలు, వృద్ధులు, వంటి వారే అధికంగా నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. వారికి పరిహారం నిర్ణయించకుండా, 2013 భూ సేకరణ చట్టం అమలు చేయకుండా, ఆర్ఆర్ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వకుండా రోడ్డు పనులు చేపట్టడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం వారికి ఉపాధి కల్పించే చర్యలు, వారి పిల్లలకు ఉద్యోగాలు కల్పించడం వంటి చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి నిర్వాసితులకు న్యాయం జరిగేలా చూడాల్సింది పోయి, వారికి ఏమీ తెలియదన్నట్లుగా వ్యవహరించడం సరికాదన్నారు. ఎస్టిమేషన్ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలన్నారు. గ్రామ సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా పరిహారం ప్రకటించిన తరువాతనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ చర్యలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, జిల్లా నాయకులు వి.శివారెడ్డి, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, కుళ్లాయప్ప, మన్నీల రామాంజినేయులు, సూర్యచంద్ర, సీనా, వెంకటకొండ, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

వరినాట్లు వేసి సిపిఎం నిరసన



వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న సిపిఎంనాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు మండలంలోని మడ్డిపల్లి, మడుగుపల్లి గ్రామాలకు వెళ్లే రహదారిలో నిలిచివున్న నీటిలో సిపిఎం నాయకులు వరినాట్లు వేసి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..మడ్డిపల్లి, మడుగుపల్లి గ్రామాల మధ్య వేస్తున్న రోడ్డు పనులను బిల్లులు రాలేదని మధ్యలోనే ఆపివేశారన్నారు. వర్షం వస్తే రోడ్డుపై నీరు నిలిచి కుంటలను తలపిస్తోందన్నారు. ఈదారిలో ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో రోడ్డుపై నిలువవున్న నీటిలో వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్నామని చెప్పారు. పాలకులు మడ్డిపల్లి, మడుగుపల్లి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తే సమస్యలు తెలుస్తాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ గ్రామాలకు రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, మహిళా సంఘం నాయకులు మల్లేశ్వరి, నారాయణమ్మ, గ్రామస్తులు ఆది, భారతి, ఓబులమ్మ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

యమపాశాలుగా విద్యుత్ తీగలు

మొద్దు నిద్రలో విద్యుత్ అధికారులు



మర్తాడు గ్రామంలో తెగిపడ్డ విద్యుత్ తీగలు

ప్రజాశక్తి-గార్లదిన్నె

నిత్యం జిల్లాలో ఏదో ఒక గ్రామంలో విద్యుత్ తీగలు తగిలి మనుషులు చనిపోతున్నా అధికారుల్లో మాత్రం ఎలాంటి చలనం లేదనేది గురువారం గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో జరిగిన సంఘటనే ఒక ఉదాహరణ. గ్రామంలోని నడివీధిలో విద్యుత్ తీగలు నాసిరకంగా మనుషుల చేతికి అందేలా ఉన్నాయని, వాటి వల్ల ప్రమాదం పొంచి ఉందని, వాటిని మార్చాలని విద్యుత్ ఏఈ శివప్రసాద్‌కు గ్రామస్తులు పలుర్లు విన్నవించినా ఫలితం శూన్యమని గ్రామస్తులు ప్రజాశక్తికి తెలియజేశారు. దీనిపై ఏఈని గ్రామస్తులు నిలదీస్తే ప్రభుత్వం నుంచి నిధులు రాలేదని, వచ్చినప్పుడు మారుస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. నిధుల విషయమై మీరు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని చెప్పారని వాపోయారు. గురువారం విద్యుత్ తీగలు తెగి కిందపడ్డాయన్నారు. ఆ సమయంలో మనుషులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలను మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కుటీర పరిశ్రమల ఏర్పాటు నిరుద్యోగులకు వరం

డిసెంబర్ 6న భూముల పరిశీలన
పారిశ్రామికవేత్త జికె.కృష్ణమూర్తి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కరువు ప్రాంతంలో కుటీర పరిశ్రమల ఏర్పాటు నిరుద్యోగ యువతకు వరమని పారిశ్రామికవేత్త జికె.కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం అక్కమాంబ ఆలయం వద్ద గోళ్ల సర్పంచి కవిత బొజ్జన్నలతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. డిసెంబర్ 6వ తేదీన బోరంపల్లి, గోళ్ల గ్రామాల్లో భూములు పరిశీలించేందుకు పారిశ్రామిక కంపెనీల ప్రతినిధులు వస్తునట్లు వెల్లడించారు. కళ్యాణదుర్గం ప్రాంత అభివృద్ధి కోసం పరిశ్రమలు నెలకొల్పేందుకు ఏడాది కాలంగా కృషి చేస్తున్నామని చెప్పారు. 2010లో పరిశ్రమ ఏర్పాటు కోసం మాజీ మంత్రి రఘువీరారెడ్డి తిమ్మసముద్రం ప్రాంతంలో 11 వేల ఎకరాల భూమిని కేటాయించారన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో రాష్ట్ర విభజన అనంతరం పలు కంపెనీలు వెనక్కి వెళ్లాయన్నారు. రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక పరిస్థితి దృష్ట్యా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బంది తలెత్తిందన్నారు. వీటి దృష్ట్యా ఈ ప్రాంత అభివృద్ధి కోసం తన వంతు కృషిచేసేందుకు దేశంలోని వివిధ కంపెనీలను సంప్రదించినట్లు చెప్పారు. ఈక్రమంలోనే పలు కంపెనీల ప్రతినిధులు అనువైన ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పరిశ్రమలు పెడితే పేదలకు, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొదవవుండదన్నారు. ఇందుకోసం రైతులు, కూలీలు, ప్రజలు, అన్ని రాజకీయ పార్టీలు, అధికారులు, అనధికారులు పూర్తి స్థాయిలో సహాయసహకారాలు అందించాలని కోరారు. తాను ఈ ప్రాంత వాసిగా ప్రజలకు సేవలందించేందుకు సహకారం అందిస్తున్నానని చెప్పారు. ఇందులో భాగంగానే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రూ.40 లక్షలు వేయంతో ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు, రూ.2 కోట్ల వేయండంతో అక్కమాంబ కొండపైకి మెట్లు, ఆలయాల అభివృద్ధి కోసం ఆర్థిక సాయం అందించిన్నట్లు తెలియజేశారు. సమావేశంలో తిమ్మప్ప యాదవ్, తిప్పేస్వామినాయక్, ఆర్‌కె.రాజు, తిప్పేష్, వీరేష్, పవన్, నాగేంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పారిశ్రామికవేత్త జికె.కృష్ణమూర్తి

కార్మికుల సమస్యలు పరిష్కరించే దాకా పోరాటం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్



ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి -అనంతపురం

రుద్రంపేట పంచాయతీలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ పంచాయతీ కార్యాలయం ఎదుట సిఐటియు కార్మికులు గురువారం ధర్నా చేశారు. పంచాయతీ సెక్రటరీ, సర్పంచి కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వీడాలని నినాదాలు చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రుద్రంపేట గ్రామ పంచాయతీలో కార్మికులకు కేవలం రూ.తొమ్మిది వేలు వేతనం ఇస్తున్నారన్నారు. పెరిగిన ధరలతో అది ఏ మూలకూ చాలడంలేదన్నారు. మునిసిపాలిటీ కార్మికులకు రూ.21 వేలు వేతనం ఇస్తున్నారని, అదే వేతనం రుద్రంపేట కార్మికులకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో పంచాయతీ కార్యాలయానికి తాళాలు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు శివప్రసాద్, నూర్‌బాషా, వేణు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఔదార్యం

జిల్లా గ్రంథాలయ సంస్థకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు ఔదార్యం చాటుకున్నారు. తన విద్యాభ్యాసానికి, ఉన్నత స్థాయి ఉద్యోగం సంపాదించుకోవడానికి దోహదపడిన పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థకు అందజేశారు. గురువారం తన వద్ద ఉన్న విలువైన పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్‌ఎం.ఉమామోహన్‌రెడ్డి, ఆ సంస్థ కార్యదర్శి పి.రమలకు అందజేసి ఔదార్యం చాటుకున్నారు. రూ.2 లక్షల విలువజేసే జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు ఇవ్వడంపై సంస్థ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. విలువైన పుస్తకాలు పేద విద్యార్థులకు ఉపయోగపడతాయన్న ఉద్దేశంతో అందజేసినట్లు డీఎస్పీ తెలిపారు. 1985 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు తాను చదివిన బుక్స్ ఇచ్చానన్నారు. ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు

ఎస్‌టిఐపై చర్యలు తీసుకోవాలని వినతి

ప్రజాశక్తి-గుత్తి

సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమణమ్మ కార్మికులపై వేధింపులకు పాల్పడుతోందని ఆమెపై చర్యలు చేపట్టాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ గిరిధర్, సీనియర్ అసిస్టెంట్‌కు వేర్వేరుగా గురువారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్‌టిఐ గుత్తిలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బస్సు డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిపై వేధింపులకు పాల్పడుతోందన్నారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తోందని అన్నారు. ఆమె దూషణలకు డ్రైవర్లు, కండక్టర్లు మనస్థాపానికి గురవుతున్నారని చెప్పారు. ఆమె వేధింపులపై గతంలో అధికారులకు విన్నవించామని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆమెపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి పి.కంబగిరి రాముడు, డిపో కార్యదర్శి వి.జ్ఞానేశ్వర్, నాయకులు ఎస్.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ఇంటర్న్‌షిప్‌పై అవగాహన

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేయాల్సిన ఆరు నెలలు ఇంటర్న్ షిప్ గురించి తల్లిదండ్రులకు గురువారం అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ రఘురామ్మూర్తి మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ డిగ్రీ ఐదవ, ఆరవ సెమిస్టర్స్‌లో ఆరు నెలల ఇంటర్న్ షిప్ ప్రవేశపెట్టడం మంచి పరిణామం అన్నారు. విద్యార్థుల చదువులయ్యాక ఉద్యోగులుగా స్థిరపడడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. కళాశాల విద్యార్థులు క్రిష్ణగిరి వింధ్య కాల్ సెంటర్, జియో, ఎన్‌ఐసిటి, సత్యం కంప్యూటర్స్ లాంటి వాటిలో ఇంటర్న్‌షిప్ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు ప్రసాద్, రాధాకృష్ణ, నారాయణ. వెంకటేషులు, పాండురంగ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విజయసంకల్ప యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్లు మండల పరిధిలోని చీకలగురికి గ్రామంలో తలపెట్టిన విజయసంకల్పయాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎంపీపీ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తనయుడు, యువనేత ప్రణయ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విజయసంకల్ప యాత్రను ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పిఎసిఎస్ ఛైర్మన్లు, పాలకమండలి సభ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి హనుమంతు మండల కన్వీనర్ బసన్న, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, వైసిపి రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కుమారుడి హత్య కేసులో తండ్రికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-గుత్తి

కన్న కొడుకుని హత్య చేసిన తండ్రికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ గుత్తి 6వ అదనపు న్యాయస్థానం గురువారం తీర్పునిచ్చింది. పామిడి పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఖాజా మొహిద్దీన్ కుమారుడు షేక్ జావిద్ అలీ ఆటో డ్రైవర్‌గా ఉంటూ జీవనం కొనసాగించేవాడు. అతడు చెడు వ్యసనాలకు బానిసై నిత్యం డబ్బు కోసం తండ్రిని వేధించేవాడు. వేధింపులు తాళలేక 2021 ఏప్రిల్ 21వ తేదీన ఇంట్లో ఉన్న జావిద్ అలీపై తండ్రి ఖాజా మొహిద్దీన్ పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అతడు కేకలు పెట్టడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంటలు ఆర్పివేసి చికిత్స నిమిత్తం పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అతడిని అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ 29వ తేదీన మరణించాడు. ఘటనపై మృతుడి తల్లి నూరి ఫిర్యాదు మేరకు పామిడి పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి జి.కబర్ది నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పును వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలలు జైలు శిక్ష విధిస్తూ ఆయన తీర్పు ఇచ్చారు. కేసును ఏపీపీ బి.సుధీర్ రెడ్డి వాదించారు.

గేటు వేయలేదని అడిగినందుకు దాడి

పుట్లూరు : గేటు వేయలేదని అడిగినందుకు దాడిచేసి గాయపరిచిన సంఘటన మండల పరిధిలోని పి.చింతలపల్లి గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు. పి.చింతలపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణారెడ్డి తన పొలం గుండా వెళ్లే దారిలో గేట్ ఏర్పాటు చేశాడు. అదే గ్రామానికి చెందిన కేశవరెడ్డి గేట్ తెరిచి దానిని తిరిగి వేయకుండా వెళ్లాడు. దీంతో హరికృష్ణారెడ్డి గేటు వేసి వెళ్లొచ్చుకదా..పశువులు వచ్చి పంట మేస్తాయని కేశవరెడ్డికి చెప్పాడు. దీంతో ఆగ్రహించిన కేశవరెడ్డి కర్రతీసుకుని హరికృష్ణారెడ్డి తలపై కొట్టి గాయపరిచాడు. హరికృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

అప్రమత్తతతో సీజనల్ వ్యాధులు దూరం

మండల ప్రభుత్వ వైద్యులు ప్రవీణ్‌కుమార్, జగదీష్

ప్రజాశక్తి-నార్పల

అప్రమత్తతతో సీజనల్ వ్యాధులను దూరం చేయవచ్చునని నార్పల, బి.పప్పూరు ప్రాథమిక ఆరోగ్యా కేంద్రాల వైద్యులు ప్రవీణ్ కుమార్, జగదీష్‌లు తెలిపారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజుల తరబడి నీరు నిలువవుండకుండా చూసుకోవాలన్నారు. దీని వల్ల దోమలు వృద్ధిచెంది మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం అందరూ జ్వరాల బారిన పడుతున్నారని, జ్వరం వచ్చిన వెంటనే సొంత వైద్యం మాని సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. మురుగునీటి కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయించి నీరు ప్రవహించేలా చూడాలన్నారు. వీధుల్లో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించాలన్నారు. ఇళ్లలోని కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లలో ఎక్కువ రోజులు నీరు నిలువవుండకుండా చూసుకోవాన్నారు. వారంలో ఒకరోజు డ్రై డే పాటించాలని తెలపారు. రాత్రి సమయంలో దోమల నుంచి రక్షణగా దోమతెరలు వాడటం అలవాటు చేసుకోవాలని తెలియజేశారు.



డాక్టరు ప్రవీణ్‌కుమార్



డాక్టరు జగదీష్

చెట్టుపై నుంచి పడి విద్యార్థికి గాయాలు

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతి గృహంలో ఉన్న ఓ విద్యార్థి గురువారం చెట్టు మీద నుంచి పడి గాయపడ్డాడు. వసతి గృహానికి చెందిన యాగంటి రెడ్డి 5వ తరగతి చదువుతున్నాడు. తోటి విద్యార్థులతో కలిసి ఆడుకునేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి కిందపడడంతో ఎడమ చేయి విరిగింది. చికిత్స నిమిత్తం ఆ బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు రాప్తాడు విద్యార్థులు

రాప్తాడు : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 ఖోఖో పోటీలకు రాప్తాడు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ పద్మజదేవి తెలిపారు. బుధవారం అనంతపురం గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల నందు నిర్వహించిన పోటీలలో తమ విద్యార్థులు కె.మహేష్‌బాబు, జె.మహేష్‌లు ఎంపికయ్యారన్నారు. వీరిద్దరూ ఇంటర్మీడియట్ చదువుతున్నారని తెలిపారు. పీడీ బాలగొండ మల్లికార్జున, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

ప్రభుత్వ వైద్యుడిపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన విద్యార్థిని షేక్ ముబీనాబి మృతికి కారకులైన వైద్యుడు రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ డిమాండ్ చేశారు. వైద్యుడి నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం స్థానిక ఆ పార్టీ కార్యాలయం నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా చేపట్టి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌కు వినతిపత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ డివిజన్ కమిటీ అధ్యక్షులు శ్రీరాములు, ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ కమిటీ కార్యదర్శి ఆశాబీ, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

బెలుగుప్ప : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి పెద్దన్న అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలు, గ్రామాల్లో తాగునీటి సమస్య, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, ప్రభుత్వ భవన నిర్మాణాల పూర్తి, గ్రామాలకు లింకురోడ్డు, పారిశుధ్యం తదితర వాటిపై చర్చించారు. వైస్ ఎంపీపీ పుష్పావతి, సర్పంచులు రామ్మోహన్, రామిరెడ్డి, రమేష్, నాయకులు వెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరిగన్న, తహశీల్దారు ఈశ్వరయ్యశెట్టి, ఎంపీడీవో యాదవేంద్ర, ఎంఇఒ మల్లారెడ్డి, హెచ్ఒ ధనుంజయ, ఏవో పృధ్వీసాగర్, విద్యుత్ అధికారి గంగాధర, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి

గుత్తి : రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ అనుబంధ సంస్థ రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నియోజకవర్గ నాయకులు మక్బూల్ బాషా మాట్లాడుతూ జిల్లాలో పంటలు సాగు చేసిన రైతులు దిగుబడి రాక తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. వేరుశెనగ పంట సాగుచేసిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు, పత్తి పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు చొప్పున నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. తడిసిన వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. నియోజకవర్గం లోని మూడు చెరువులను హంద్రీనీవా నుంచి కృష్ణ జలాలతో నింపాలన్నారు. అనంతరం ఉప తహశీల్దార్ కె.హాజీవలికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, మండల కార్యదర్శి రామదాసు, నాయకులు నరసింహయ్య, రామకృష్ణ, పూల మాబు, డానియల్, మహిళా సంఘం నాయకురాలు మొహమ్మద, మహబూబ్‌బీ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ మన ప్రభుత్వం

అనంతపురం : నగరంలోని 10, 11వ డివిజన్లలో కార్పొరేటర్లు లక్ష్మీదేవి, రామాంజమ్మలతో కలిసి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు స్థానికంగా ఉన్న సమస్యలపై ఆరాతీసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఫయాజ్, జెడ్పి ఛైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ శంషుద్దీన్, 11వ డివిజన్ కన్వీనర్ మహబూబ్ బాషా, పలువురు డైరెక్టర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.